క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



చిత్రలేఖన పోటీలకు హాజరైన విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని జేవీవీ అధ్యక్షులు సుధీర్ రాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహా సభల సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో శనివారం ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకు జేవీవీ కృషి చేస్తుందన్నారు. చిత్రలేఖన పోటీల్లో 39 పాఠశాలల నుంచి 470 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నగర కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు, బాలోత్సవ కమిటీ కార్యదర్శి ధనుంజయ, సమతా జిల్లా కన్వీనర్ రమాదేవి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



గువ్వల శ్రీలతను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): విజయవాడలో గత నెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక సీరాక్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని గువ్వల శ్రీలత ప్రతిభ చాటి వెండి పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు వజీరా తెలిపారు. శనివారం విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మేరీ స్వప్న, దుర్గా శకుంబి, మాస్టర్ టీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

కర్నూలు(హాస్పిటల్): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని కిమ్స్ కడల్స్ హాస్పిటల్ నియోనెటాలజిస్టు డాక్టర్ హెచ్.ఎ.నవీద్ అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ నవీద్ మాటాల్డుతూ మారుతున్న జీవనశైలిలో అపోహలతో కొందరు తల్లులు తమ పిల్లలకు పాలు ఇవ్వడం మానేశారని, ఇది చాలా తప్పన్నారు. ఇది వారి చిన్నారుల ఆరోగ్యాన్ని చేజేతులా నష్టం కలిగించిన వారవుతారన్నారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచే తల్లిపాలు ఇవ్వడంపై మెలకువలు నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్, రఫిక్ అహ్మద్, గోవర్ధన్ రెడ్డి, భారతి, ఫణిభూషణ్, సుష్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

కర్నూలు: నగరంలోని కృష్ణా నగర్‌లోని సర్వేపల్లి ఒకేషనల్ కాలేజీలో శనివారం సైబర్ మోసాలకు అడ్డుకట్ట, రోడ్డు ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాల వినియోగంతో కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు జరుగుతున్న తీరును ఉదాహరణలతో వివరిస్తూ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల ప్రత్యేకంగా బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడం, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా చేసుకునే పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళను ఏపీ హంస నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగుల సీనియారిటీ అర్హతలను బట్టి పోస్టు కన్వర్షన్‌కు అనుమతి ఇవ్వాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్‌ల సీనియారిటీ జాబితా తయారు చేసి నేటికి సంవత్సరం దాటినా జూనియర్ అసిస్టెంట్ పదోన్నతికి సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించలేదన్నారు. వెంటనే పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ఎంఎన్‌ఓలకు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏను కొన్ని ట్రెజరీ కార్యాలయాల్లో ఇవ్వడం లేదని, సంబంధిత జీవో కాపీని పంపి అందరికీ హెచ్‌ఆర్‌ఏ వచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షులు రఘుబాబు, జిల్లా కార్యదర్శి సయ్యద్ షఫి, ఉపాధ్యక్షులు కరుణానిధి ఉన్నారు.

టీడీపీ అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

- టీడీపీ కార్పొరేటర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- పోడియం వద్ద బైఠాయింపు
- క్షమాపణలు చెప్పిన టీడీపీ కార్పొరేటర్
- వాకౌట్ చేసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసిన మేయర్



మేయర్ పోడియం ఎదుట బైఠాయించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ కార్పొరేటర్లును నిలువరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరపాలక సర్వసభ్య సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. టీడీపీ కార్పొరేటర్‌ను సస్పెండ్ చేయాలంటూ పట్టుబట్టి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. నాలుగున్నర ఏళ్లలో కౌన్సిల్ సమావేశాల్లో కోరం లేక వాయిదా పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది.

అసలేం జరిగిందంటే..

నగరపాలక సంస్థ కార్యాలయంలోని నూతన కౌన్సిల్ హాలులో శనివారం నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశంలో మొత్తం 41 అంశాలకు సంబంధించిన అజెండా అంశాలపై సభ్యులు చర్చించి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటి వరకు ఒకటిన్నర గంట సేపు ప్రశాంతంగా జరిగింది. అయితే సభలో 30 అంశంపై మాట్లాడుతున్న సమయంలో టీడీపీ కార్పొరేటర్ క్రాంతికుమార్ అనుచితంగా మాజీ ఎమ్మెల్యేలపై వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, దండు లక్ష్మీకాంతారెడ్డి, షేక్ అహమ్మద్, నారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సాంబశివరావు, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, పుల్లమ్మ, కటారి పల్లవి, మునెమ్మ, గాజుల శ్వేతారెడ్డి, ఆర్షియా ఫర్హీన్ తదితరులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు కార్పొరేటర్‌తో వాగ్వాదానికి దిగారు. క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ కౌన్సిల్‌లో పోడియం వద్ద బైఠాయించారు. టీడీపీ కార్పొరేటర్‌ను సస్పెండ్ చేయాలని వాకౌట్ చేశారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ క్షమాపణలు చెప్పారు.

గందరగోళం..

వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్పొరేటర్ల వాగ్వివాదం మధ్య సమావేశంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. దీంతో మేయర్ 10 నిమిషాలు సమావేశాన్ని వాయిదా వేశారు. 20 నిమిషాల తరువాత మళ్లీ సమావేశాన్ని ప్రారంభించారు. టీడీపీ కార్పొరేటర్లు హాజరైనా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు వాకౌట్ చేశారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి సమావేశానికి వచ్చి 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ ప్రాతిపదికన కేటాయిస్తున్నారంటూ అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. అయితే అప్పటికే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కొంత మంది వచ్చారు. సమావేశం కొనసాగించాలంటే 18 మంది సభ్యులు ఉండాలని, ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉండటంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఇంకా 11 అంశాలపై చర్చించాల్సి ఉన్నా సమావేశం వాయిదా పడింది.

రూ. 29.58 కోట్ల పనులకు ఆమోదం

మొత్తం 31 అంశాలపై సభ్యులు చర్చించగా.. రూ. 29.58 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ అమోదించింది. రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డులకు నోడల్ అధికారుల నియామకం

కర్నూలు (టౌన్): నగరంలో పరిపాలన సౌలభ్యంలో భాగంగా పారిశుధ్యం, తాగునీరు సరఫరా, అభివృద్ధి పనులు, ఆక్రమణల తొలగింపు కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారులుగా జునీద్, మనోహర్ రెడ్డి, అంజాద్ బాషా, క్రిష్ణలత, జనార్ధన్, గిరిరాజు, వెంకటేశ్వర్లు, వైష్ణవి, గంగాధర్, నరేష్ కుమార్, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ మల్లన్న, భాను ప్రతాప్, విజయలక్ష్మి, అబ్దుల్ వాజిద్‌లను నియమించినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు శానిటేషన్, ప్లానింగ్, అమినిటీస్ కార్యదర్శులతో కలిసి నోడల్ అధికారులకు కేటాయించిన వార్డుల్లో అభివృద్ధి పనుల పురోగతి కార్యక్రమాల స్థితిగతులపై నివేదికలు సమర్పిస్తారన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఈదూరు పద్మాకర్



ఈదూరు పద్మాకర్

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వంచే నయోదు చేయబడిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా కర్నూలుకు చెందిన ఈదూరు పద్మాకర్ నియమించబడ్డారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ పీ సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శనివారం పద్మాకర్ విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో ఎస్‌టీబీసీ కళాశాలలో విద్యార్థి నాయకునిగా, రాష్ట్ర నర్సింగ్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. పౌరుల హక్కులను కాపాడేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

దేశ సంస్కృతికి బళ్లారి రాఘవ కృషి



రాఘవ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ తదితరులు

కర్నూలు(సెంట్రల్): దేశ సంస్కృతికి బళ్లారి రాఘవ విశేష కృషి చేశారని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ కొనియాడారు. శనివారం ఉదయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో టూరిజం, ఐసీడీఎస్‌శాఖల ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా తాడిపత్రిలో బళ్లారి రాఘవ 1880 ఆగస్టు 2వ తేదీన జన్మించి న్యాయవాదిగా స్థిరపడ్డారని చెప్పారు. తెలుగు నాటక రంగానికి విశేషమైన కృషి చేసి కళాకారుడిగా దేశ, విదేశాల్లో పేరు గడించారని చెప్పారు. టూరిజం, ఐసీడీఎస్ అధికారిణి విజయ మాట్లాడుతూ.. బళ్లారి రాఘవ కర్నూలుకు చెందిన కృష్ణమ్మను వివాహం చేసుకున్నారని, ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం పబ్లిక ప్రాసిక్యూటర్‌గా నియమించి రావు బహదూర్ బిరుదు ఇచ్చినట్లు చెప్పారు.

అంతర్జాతీయ గుర్తింపు నటుడు బళ్లారి రాఘవ

కర్నూలు కల్చరల్: తెలుగు, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో మేటి నటుడుగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన నటుడు బళ్లారి రాఘవ అని సాహితీ వేత్తలు, కళాకారులు అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సాహితీ వేత్తలు, కళాకారులు పూల మాల వేసి నివాళులర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కోలాచలం శ్రీనివాసరావు, బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు 150 సంవత్సరాల క్రితం తెలుగు నాటక రంగానికి విశేష ప్రచారం చేశారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బళ్లారి రాఘవ జయంతిని అధికారికంగా ప్రకటించినా జిల్లా అధికారులు మొక్కుబడిగా నిర్వహించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కళాకారులు, రచయితలు దస్తగిరి, నవీన్ చౌదరి, భాస్కర్, అజీజ్, శ్రీనివాసరెడ్డి, రాజా రత్నం, కేవీ రమణ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి రాఘవ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు, కళాకారులు

వైద్యపరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి చికిత్సకు వచ్చే రోగులకు వైద్యపరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఉన్న విభాగాలను తనిఖీ చేశారు. రేడియాలజీ విభాగాన్ని తనిఖీ చేసి అక్కడ ఉన్న పరికరాలు, వైద్య సిబ్బంది గురించి ఆరా తీశారు. బయోకెమిస్ట్రీ విభాగానికి వెళ్లి ల్యాబ్‌టెస్టులు, సిబ్బంది గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ రిపోర్టులు, ఎంట్రీ సక్రమంగా అయ్యేటట్లు చూడాలని చెప్పారు. బ్లడ్‌బ్యాంకులో ఉన్న పరికరాలు, రిజిస్టర్‌ను పరిశీలించి తలసీమియా కేసుల వైద్యపరీక్షల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, ఇన్‌చార్జ్ ఏఆర్‌ఎంవో డాక్టర్ సునీల్ ప్రశాంత్ ఉన్నారు.



డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను తనిఖీ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

పార్టీని మరింత బలోపేతం చేయాలి



ఎస్వీ దంపతులను సన్మానిస్తున్న నాగేంద్ర బాబు

కర్నూలు (టౌన్): పదవులు దక్కిన వారంతా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. పార్టీ అధిష్టానం రెండు రోజుల క్రితం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన నాగేంద్రబాబును రాష్ట్ర సోషల్ మీడియా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించింది. దీంతో శనివారం ఆయన గిప్సన్ కాలనీలో ఉన్న ఎస్వీ మోహన్ రెడ్డి స్వగృహంలో ఎస్వీ మోహన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ విజయ మనోహరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సత్కరించారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ సత్తా

కర్నూలు సిటీ: పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో ఆర్.ఎస్ అకాడమీలో శిక్షణ పొందిన అభ్యర్థులు సత్తాచాటినట్లు అకాడమీ డైరెక్టర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో పాటు మొత్తం 125 మంది సివిల్, ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు తమ అకాడమీ అభ్యర్థులు ఎంపికై య్యారన్నారు. మనోజ్ 153 మార్కులు, రాజ్‌కుమార్ 152 మార్కులు, రవికుమార్ 151 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు బోయ శేఖర్, జయలక్ష్మీ, కృష్ణవేణి, సురేష్‌కుమార్, రామాంజనేయులు కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారన్నారు. తమ అకాడమీలో శిక్షణ పొందిన అభ్యర్థులకు బోధనలో అనుభవం కలిగిన ఫ్యాకల్టీ తరగతులు నిర్వహించడం, రెగ్యులర్‌గా గ్రాండ్ టెస్టులు నిర్వహించడంతో సులువుగా ఉద్యోగాలు సాధించారన్నారు.

స్మార్ట్‌మీటర్లు అమర్చితే పగలగొట్టండి



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లను అమర్చితే పగలగొట్టాలని సీఐటీయూ న్యూసిటీ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డు, కల్లూరు ఎస్టేట్‌లోని హమాలీ వర్కర్స్ యూనియన్ వేర్వేరు కార్యక్రమాల్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆగస్టు 5వ తేదీన పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని కోరారు. అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన చంద్రబాబునాయుడు, లోకేష్ అధికారంలోకి రాగానే మళ్లీ వాటిని అమలు చేయడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పటికే రూ.19 వేల కోట్ల భారాలను ప్రజలపై వేశారని, మళ్లీ మరో రూ.12 వేల కోట్ల భారం మోపేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతుండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.గోవిందు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించే కాలేజీలపై చర్యలు తీసుకోండి



ఆర్ఐఓ లాలెప్పకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం విద్యార్థి సంఘాల నాయకులు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి జి.లాలెప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణకుమార్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్.ఎస్.యు.ఐ) జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ జూనియర్ కాలేజీల నిర్వహణకు ఏటా ఇంటర్మీడియేట్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌ను జారీ చేస్తుందని, అయితే ఆ క్యాలెండర్ ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు తరగతులు నిర్వహించడం లేదన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థిలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర ఉపాధ్యక్షులు అస్లాం భాష, ఎన్ఎస్‌యూఐ నాయకులు నవదీప్,తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల బైక్ ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): ఈనెల 9, 10, 11 తేదీల్లో కర్నూలులో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బైక్ ర్యాలీని మహాసభల ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప కలెక్టరేట్ ఎదుట ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రెండు రోజులపాటు జన్ సేవాదళ్ క్యాంపును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహేష్, డి.శ్రీనివాసరావు, వెంకటేశ్, చంద్రశేఖర్, ఈశ్వర్, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘స్నేహా’భరణం

- కాలం మారినా కలకాలం నిలిచేది స్నేహం
- ఆన్‌లైన్‌లో స్నేహాలతో అనర్థమే
- కష్ట సుఖాల్లో తోడుగా ఉంటున్న స్నేహితులు
- నేడు స్నేహితుల దినోత్సవం



కర్నూలు కల్చరల్: స్నేహం.. అంటే నిస్వార్థం.. స్నేహం అంటే ప్రేమ.. స్నేహం అంటే ఒక మధుర ఫలం.. తరాలు గడిచినా యుగాలు అంతరించినా తరగని పెన్నిధి స్నేహం. కలిమి కలిగినప్పుడు ఎంతో మంది స్నేహితులు కూడుకుంటారు. ఇది గొప్ప కాదు. లేమి ఎదురై వెక్కిరించినప్పుడు కష్టాల కడలిలో చిక్కుకున్నప్పుడు.. ‘భయపడకు నేస్తం..నేనున్నానంటూ’ ధైర్యం చెప్పే వాళ్లే నిజమైన స్నేహితులు. బంధుత్వం, రక్త సంబంధం కన్నా స్నేహబంధమే విడదీయని అనుబంధం. నిజమైన స్నేహం త్యాగాన్నే కోరుకుంటుంది కానీ.. సహాయానికే నిలువెత్తు సాక్షిగా నిలుస్తుంది కానీ.. స్వార్థం చూపులను కూడా దగ్గరకు రానివ్వదు. కానీ ఈ నాటి స్నేహం అవసరాలకు, ఆనందాలకు స్వార్థానికి సంకుచిత భావాలకు సాక్షిగా కనిపిస్తుంది. కొన్ని ఆన్‌లైన్ స్నేహాలు అనర్థాలకు దారి తీస్తున్నాయి. వీటన్నింటిని వీడి స్నేహం బంధాన్ని శాశ్వతంగా నిలుపుకోవాల్సిందే. స్నేహానికి విభిన్న అర్థాలు కూడా చెప్పుకోవచ్చు. భార్యాభర్తల మధ్య స్నేహం విరబూస్తే ప్రేమ పరిమళిస్తుంది. దంపతులు కూడా స్నేహితులుగా ఉంటే దాంపత్య జీవితం మధురంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో చెప్పుకోలేని ఎన్నో ఊసులు స్నేహితుల మధ్య అమరికలు లేకుండా మనస్సులోంచి బయటకు వచ్చేస్తాయి. మంచి స్నేహితునికి మించిన వరం మరొకటి ఉండదనేది పెద్దల మాట. ఎందుకంటే అమ్మలోని ఆప్యాయత.. నాన్నలోని ప్రేమ, అన్నలోని అనురాగం, అక్కలోని అభిమానం అన్నీ రంగరిస్తే.. కన్పించేదే స్నేహం. పగతో దేన్నీ సాధించలేం. ప్రేమతో కలిగిన స్నేహంతో దేనైన్నా సాధించవచ్చు సత్యాన్ని అందరూ గ్రహించాలి.

వీరిది 25 ఏళ్ల స్నేహ బంధం..

ఈ చిత్రంలోని ముగ్గురు స్నేహితులు పి.నరసింహారెడ్డి (విశ్రాంత ఎస్ఈ), బి. జయరామిరెడ్డి (విశ్రాంత ఎస్ఈ), ఏవీ శ్రీధర్ రెడ్డి (ప్రస్తుతం నంద్యాల జిల్లా ఎస్ఈ) రహదారులు భవనాల శాఖలో జిల్లా అధికారులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. వీరు ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌లో జేఈఈ క్యాడర్‌లో ఉద్యోగంలో చేరారు. అప్పుడు మొదలైన స్నేహం నేటికీ కొనసాగుతోంది. 25 ఏళ్ల స్నేహంలో ఎలాంటి మనస్పర్థలు భేదాభిప్రాయాలు లేకుండా ఉన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఉద్యోగ, కుటుంబ సమస్యలు ఇలా ప్రతి విషయంలో ముగ్గురు చర్చించుకుంటూ పరిష్కరించుకుంటున్నారు. ఇన్నేళ్ల స్నేహంలో వీరి మధ్య రహస్యమనేది లేదని వారు చెబుతున్నారు. కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఇప్పటికి వారంలో రెండు మూడు సార్లు కలుసుకోవడం సరదాగా కబుర్లు చెప్పుకుంటుంటామని నరసింహారెడ్డి చెబుతున్నారు. ఇలా కలుసుకోవడం వల్ల ఏవైనా బాధలు ఉన్నా కుటుంబ సభ్యులతో చెప్పుకోలేకున్నా.. స్నేహితులతో చర్చించుకోవడం వల్ల కొంత ఉపశమనం కలుతుందంటున్నారు. ప్రతి ఒక్కరికీ స్నేహితులు ఉండటం వరం లాంటిదేనని వారు చెబుతున్నారు.



నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, శ్రీధర రెడ్డి

ఉద్యోగ శిక్షణ స్నేహితులను చేసింది..



తేజశ్వని,కళావతి, హేమాంజలి, ప్రణీతా బాయి

ఈ చిత్రంలోని నలుగురు స్నేహితులు అటవీశాఖ కర్నూలు డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌వో) పి.తేజశ్వని (కర్నూలు), వైఎస్సార్ కడప డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.కళావతి (అనంతపురం), వైఎస్సార్ కడప డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎమ్.హేమాంజలి (తిరుపతి), నంద్యాల డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీతా బాయి (అనంతపురం). వివిధ ప్రాంతాలకు చెందిన ఈ నలుగురు 2021లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ట్రైనింగ్‌లో కలుసుకున్నారు. ఆ నాలుగేళ్లలో శిక్షణతో పాటు ప్రస్తుతం ఉద్యోగంలో ఒకరికొకరు తోడూనీడగా నిలుస్తున్నారు. సహోద్యుగులుగా కలుసుకున్నా స్నేహ కుటుంబంలో సభ్యులుగా మారిపోయామని చెబుతున్నారు. నలుగురు స్నేహితులం అడవి నిర్వహణ, వన్యప్రాణి ఫొటోగ్రఫీలో సాంకేతికతను ఉపయోగించడంలో ఆసక్తిని చూపుతూ ముందుకు కెళ్తున్నామంటున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించుకోవడం, ఎలాంటి సంతోష విషయాన్నైనా అందరం పంచుకోవడంలో ఆ అనుభూతే వేరు.. అని చెబుతున్నారీ ఈ నలుగురు. సంవత్సరంలో రెండు సార్లు అయినా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ట్రెక్కింగ్ వెళ్తుంటామని చెబుతున్నారు.

రక్ష హాస్పిటల్‌కు తాళం



రక్ష హాస్పిటల్‌కు తాళం వేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని రక్ష హాస్పిటల్‌కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ శనివారం సాయంత్రం తాళం వేశారు. ఈ హాస్పిటల్‌లో ఓ మహిళకు లింగనిర్ధారణ చేయడంతో ఆమెకు జన్మించబోయేది ఆడబిడ్డ అని తేల్చారని, దీంతో నందికొట్కూరులో ఓ ఆర్‌ఎంపీ ఆమెకు అబార్షన్ చేయడంతో మృతి చెందినట్లు విచారణలో తేలింది. దీంతో నంద్యాల డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. స్కానింగ్ చేసింది కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో అని, చర్యలు తీసుకోవాలని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు లేఖ రాశారు. ఈ మేరకు డాక్టర్ పి.శాంతికళ శనివారం సాయంత్రం రక్ష హాస్పిటల్ తనిఖీకి వెళ్లారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆసుపత్రికి తాళం వేశారు. ఆమె వెంట డీఐవో డాక్టర్ నాగప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి, పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

తైక్వాండోలో కర్నూలుకు పతకాలు

కర్నూలు (టౌన్): విజయవాడలో చెన్నుపాటి రామకోట స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో కర్నూలుకు చెందిన 11 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులను శనివారం స్థానిక షరీన్‌నగర్‌లోని వెంకట్ తైక్వాండో అకాడమీలో జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు బీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.